ఈనాడు
శ్రీ సత్యసాయి
బుధవారం అక్టోబరు 2, 2024

2,59,302 మందికి పింఛన్ పంపిణీ


ఓడీసీలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, పెనుకొండ, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఉదయం 5.30 గంటలకే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా తొలిరోజు 97.03 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. 2,67,238 గాను 2,59,302 మందికి పంపిణీ చేశారు. జిల్లాలో అత్యధికంగా హిందూపురం పట్టణంలో 98.43 శాతం అందజేయగా, అత్యల్పంగా కనగానపల్లి మండలంలో 93.33 శాతం పంపిణీ చేశారు. మిగిలినవారికి ఈనెల 3న పంపిణీ చేయనున్నారు. పెనుకొండ పట్టణంలోని 12, 13 వార్డుల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను నగదు అందజేసి, సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పలువురు పింఛను లబ్ధిదారులు మంత్రితో సంతోషాన్ని పంచుకున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, కదిరిలో ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూటమి శ్రేణులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.


మంత్రి సవితతో సంతోషం పంచుకొంటున్న వృద్ధురాలు

పరిశ్రమ పేరుతో స్వాహా

- రుణం తీసుకుని.. యంత్రాలు మాయం చేసిన వైకాపా నాయకుడు
- అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు

బెళుగుప్ప, ఉరవకొండ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో పరిశ్రమ నిర్వహణకు అధికార బలంతో రుణం తీసుకున్న వైకాపా నాయకుడు.. రుణాన్ని తిరిగి చెల్లించకపోగా, యంత్రాలను సైతం మాయం చేసి.. . మోసం చేసిన ఘటన బెళుగుప్ప మండలంలో వెలుగు చూసింది. మంగళవారం ఎస్‌ఐ శివ తెలిపిన వివరాలిలా... బెళుగుప్ప వైకాపా మండల కన్వీనరు చిన్న మచ్చన్న బ్రాహ్మణపల్లి సమీపంలో సిమెంట్ ఇటుకల తయారీకి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ నుంచి 2020, జూన్‌లో రూ.43.90 లక్షల రుణాన్ని పొందాడు. ఆ మొత్తంతో శ్రీసాయి ఫ్లైయాష్ బ్రిక్ ఇండస్ట్రీస్‌ని ప్రారంభించాడు. కొంతకాలం పాటు పరిశ్రమను నడిపిన అతను.. తీసుకున్న రుణాన్ని సంస్థకు తిరిగి చెల్లించలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది మే, 30న కార్పొరేషన్ అధికారులు పరిశ్రమను తనిఖీ చేశారు. రుణం తీసుకుని ఏర్పాటు చేసిన.. ఏడు యంత్రాలు పరిశ్రమలో అధికారులకు కనిపించలేదు. దానిపై విచారిస్తే రుణం పొందిన వ్యక్తి నుంచి సరైన సమాధానం లేకపోయింది. చట్ట విరుద్ధంగా యంత్రాలను మాయం చేయడమే కాకుండా, నిబంధనల ప్రకారం రుణాన్ని తిరిగి చెల్లించకుండా మోసం చేశారని ఈ ఏడాది జులైలో సంస్థ అనంతపురం మేనేజరు వెంకట మహేశ్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు మంగళవారం బెళుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో చిన్న మచ్చన్నపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

మేఘం నిలువనంది.. చినుకు రాలకుంది

- పంటలపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి అనంత జిల్లాలో పెరిగిన సాధారణ ఉష్ణోగ్రతలు

ఈనాడు, పుట్టపర్తి

ఉమ్మడి జిల్లాను వర్షాభావ పరిస్థితులు పట్టి పీడిస్తున్నాయి. సకాలంలో వానలు కురవక వర్షాధార పంటలు దెబ్బతిన్నాయి. రెండేళ్లుగా ఖరీఫ్‌లో పంటలు చేతికందలేదు. రబీలో అరకొరగా సాగు చేసిన దిగుబడులు రావడం లేదు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ఉమ్మడి అనంత జిల్లాలో కరవు పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడానికి ఉష్ణోగ్రత, గాలి వేగంలో పెరుగుదలే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖరీఫ్‌లో ఎల్నినో ప్రభావం కారణంగా లోటు వర్షపాతం.. రబీలో లానినో ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయని.. వర్షాధార పంటల్లో దిగుబడి తగ్గిపోతూ వస్తోందని పేర్కొంటున్నారు.

జులై, సెప్టెంబరే కీలకం

ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం రైతులు జూన్ నెలాఖరు లేదంటే జులై మొదటివారంలో విత్తనాలు విత్తుకుంటారు. సెప్టెంబరులో పంట కాయ దశకు చేరుకుంటుంది. ఈ రెండు నెలల్లో పంటలకు వర్షం ఎంతో అవసరం. ఈ ఏడాది జులై, సెప్టెంబరు నెలల్లో 50 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రెండు నెలల్లో 4 రోజులకు మించి వర్షాలు కురవలేదు. ఈ ఏడాది జులైలో 11, 16 తేదీలు, సెప్టెంబరులో 1, 18 తేదీల్లో.. సగటున 4 మి.మీ. వర్షపాతం నమోదైంది. జులైలో విత్తుకున్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అంతకు ముందు విత్తుకున్న పంటలు సైతం సెప్టెంబరులో వర్షాలు లేక ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

- ఈ ఏడాది జులైలో 62 శాతం, సెప్టెంబరులో 56 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఫలితంగా వేరుసెనగ, పత్తి, కంది, ఆముదం వంటి పంటలు దెబ్బతిన్నాయి.
- వేరుసెనగ ఎదగకపోవడంతో వేర్లు బలహీనపడి కాయలు దిగలేదు. చెట్టుకు 5 కాయలు కూడా రాలేదు. పత్తిలో చెట్టుకు 80 నుంచి 90 కాయలు ఉండాల్సి ఉండగా.. పెరగకపోవడంతో 20 నుంచి 30 కాయలే ఉన్నాయి.
- ఆముదంలో ఒక కంకికి మించి రాలేదు. కందిలో మొక్క విస్తరించకపోవడంతో దిగుబడి 30 శాతం కూడా వచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో శ్రీస్యతసాయి జిల్లా వర్షపాతం వివరాలు

నెల	సాధారణం (మి.మీ.)	నమోదైంది (మి.మీ.)	వ్యత్యాసం (మి.మీ.)
జూన్	66.6	148	+81.4
జులై	70.9	42.9	-28
ఆగస్టు	93.4	189.2	+95.8
సెప్టెంబరు	125.6	59	-66.6

4 డిగ్రీలు పెరిగి..

అనంతలో గాలివేగం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆకాశంలో మేఘాలు నిలువనంతంగా గాలి వీస్తుంది. సాధారణంగా వర్షాలు బాగా కురవాలంటే గాలి వేగం గంటకు 12-15 కిలోమీటర్ల మధ్యలో ఉండాలి. ఉమ్మడి అనంత జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గాలి వేగం గంటకు 30-40 కిలోమీటర్లుగా నమోదైంది. దీని కారణంగా మేఘాలు నిలువడం లేదు. మిగిలిన నెలల్లోనూ గాలి వేగం సగటున గంటకు 20-21 కిలోమీటర్ల మధ్య ఉంటోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సగటు ఉష్ణోగ్రతల్లోనూ మార్పులు వచ్చాయని బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంట వాతావరణ పరిశోధన స్థానం శాస్త్రవేత్త నారాయణస్వామి పేర్కొన్నారు. గతనెలలో ఉష్ణోగ్రత 32 డిగ్రీలు ఉంటే ఈసారి 36 డిగ్రీలకు చేరుకుంది. ఆగస్టులోనూ సగటున 35 డిగ్రీలు నమోదైంది. దీంతో ఎండలు పెరిగిపోయి పంటలు దెబ్బతింటున్నాయని.. బోర్లు సైతం ఒట్టిపోతున్నాయన్నారు. మరోవైపు ప్రజలు సైతం ఉక్కపోతతో అల్లాడుతున్నారు.

- వాతావరణంలో మార్పులు రబీపైనా ప్రభావం చూపుతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో నేలలో తేమ తగ్గిపోతోంది. దీంతోపాటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో అవసరమైన మేర మంచు కురవడం లేదు. ఫలితంగా పప్పుశనగ పంట దిగుబడిపై ప్రభావం పడుతోందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.



- సాధారణ గాలివేగం: గంటకు 12-15 కిలోమీటర్లు
- ఉమ్మడి జిల్లాలో సగటు వేగం: గంటకు 20-21 కి.మీ
- ఆగస్టు, సెప్టెంబరులో గాలివేగం: గంటకు 30-40 కి.మీ
- ఆగస్టు, సెప్టెంబరులో సాధారణ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు
- కొద్దిరోజులుగా నమోదైన ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు


అనంతపురం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో బస్సు వద్ద రద్దీ

సొంతూళ్లకు పరుగో పరుగు..

- దసరా సందర్భంగా 210 ప్రత్యేక బస్సులు
- అన్నింటా సాధారణ ఛార్జీలే..

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో దసరాకు సొంతూరుకు వెళ్లే వారికి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. ప్రత్యేక బస్సుల్లో సైతం సాధారణ ఛార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. సాధారణ ఛార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రైవేటులో అధిక ధరలకు కళ్లెం వేసినట్లు అయింది. ఈనెల 4 నుంచి 11 వరకు 110 బస్సులు సొంతూళ్లకు వచ్చే వారికి ఏర్పాటు చేశారు. మళ్లీ తిరుగు ప్రయాణంలో కూడా అసౌకర్యం ఉండకూడదనే ఉద్దేశంతో దసరా అనంతరం ఈనెల 13 నుంచి 16 వరకు 100 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి.

ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ

ప్రత్యేక బస్సులు అన్నింటిలో ఇప్పటికే రిజర్వేషన్ ప్రారంభం అయింది. రాను, పోనూ ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ అమలు చేస్తున్నామని అనంతపురం ఆర్టీసీ రీజినల్ మేనేజరు సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా పర్యవేక్షణకు హైదరాబాద్‌తో పాటు అన్ని ముఖ్య కేంద్రాల్లో అధికారులు, సూపర్‌వైజర్లు ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేక బస్సులు ఇలా..

నగరం	దసరా ముందు	దసరా తర్వాత
బెంగళూరు	48	41
విజయవాడ	6	7
తిరుపతి	3	4
ఒంగోలు/నెల్లూరు	4	7
హైదరాబాద్	45	35
చెన్నై	4	6
మొత్తం:	110	100

కిటకిట తప్పలేదు..

అక్టోబరు 2న గాంధీ జయంతి, తర్వాత దసరా పురస్కరించుకొని విద్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు తమ సొంతూళ్లకు కదిలారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కిటకిటలాడింది.


అదిగో బస్సు.. పరిగెడుతున్న విద్యార్థులు

12 కేంద్రాల్లో టెట్ నిర్వహణ

- నిర్దేశిత సమయానికి ముందుగా అభ్యర్థులు చేరుకోవాలి
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- 'న్యూస్‌టుడే'తో డీఈవో వరలక్ష్మి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో టెట్ ఉత్తీర్ణులు కావడం మొదటి మెట్టు. ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఈ నెల 3 నుంచి 21 వరకూ నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ ఆధారితంగా టెట్ నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మితో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. డీఈవో మాట్లాడుతూ.. టెట్ నిర్వహణపై పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రాలు పరిశీలించి చెక్‌లిస్టులు కూడా అందజేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు, వైద్య, విద్యుత్తు, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. న్యూస్‌టుడే అడిగిన ప్రశ్నలకు డీఈవో ఇలా సమాధానాలిచ్చారు.

న్యూస్‌టుడే: టెట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి ఎంతమంది దరఖాస్తు ఉన్నారు. పరీక్షలు ఎప్పటినుంచి ఎప్పటివరకూ నిర్వహిస్తున్నారు.?

డీఈవో: ఉమ్మడి అనంత జిల్లా నుంచి 44,855 మంది అభ్యర్థులు టెట్‌కి దరఖాస్తు చేసుకొన్నారు. 99 శాతం మంది ఇప్పటికే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొన్నారు. 3వ తేదీ నుంచి 21 వరకూ పరీక్షలు జరుగుతాయి. రోజూ రెండు విడుతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి.

న్యూస్‌టుడే: పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్నిగంటలకు హాజరు కావాలి. వెంట తీసుకురావాల్సిన వివరాలు తెలియజేయండి.

డీఈవో: అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేనీ గుర్తింపు కార్డు వెంట తప్పనిసరిగా తీసుకురావాలి.

న్యూస్‌టుడే: టెట్ పరీక్ష కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం ఎన్ని కేంద్రాలున్నాయి?

డీఈవో: అనంతపురంలో ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి, ఎస్వీఐటీ, పీవీకేకే, శ్రీసాయిబాలాజి పీజీ కళాశాల, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోసియల్ యాక్షన్ ఇండియా, తాడిపత్రిలో సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాల, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల, గుత్తిలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల బెంగళూరులో రెయిన్‌క్లౌడ్ టెక్నాలజీస్, బిట్‌బైటెక్ సొల్యూషన్, మైల్‌స్టోన్ టెక్నాలజీస్‌లో కేంద్రాలు ఏర్పాటు చేశాం. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కావడంతో కంప్యూటర్లు, అంతర్జాలం తదితర సాంకేతిక సదుపాయాలున్న చోట కేంద్రాలు ఏర్పాటు చేశారు.

న్యూస్‌టుడే: పరీక్ష కేంద్రాలు అనంతపురంలోనే కాకుండా బెంగళూరులో కూడా ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాలు కూడా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్నాయి. వాటి చిరునామా తెలుసుకోవడానికి అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. అభ్యర్థులు సులువుగా కేంద్రాల చిరునామా తెలుసుకోడానికి సూచనలు ఇవ్వగలరు..?

డీఈవో: పరీక్ష కేంద్రాల చిరునామాలు http/// deoananthapuramu.blogspot.com అనే వెబ్‌సైట్లో పొందుపరిచాం. ఇతర సమాచారం సీఎస్ఇ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.



న్యూస్‌టుడే: పరీక్ష కేంద్రాల వద్ద సమస్యలు ఎదురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలి. సహాయకేంద్రం ఏమైనా ఏర్పాటు చేశారా?

డీఈవో: విద్యాశాఖ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశాం. ముగ్గురు అధికారులను నియమించాం. ఏడీ నాగరాజు, పర్యవేక్షకులు ఆదినారాయణ, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌నాయక్ సహాయ కేంద్రంలో అందుబాటులో ఉంటారు. సమస్యలపై 9494836875, 9059693676 చరవాణి నంబర్లను సంప్రదించవచ్చు. హాల్‌టికెట్‌లో ఫొటో సక్రమంగా రాకపోతే కేంద్రంలోనే డిపార్ట్‌మెంట్ అధికారిని సంప్రదించవచ్చు.

నీటి సమస్య తీర్చాలంటూ ఆందోళన

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో 10 రోజులుగా నీటి సమస్య తీవ్రతరం కావడంతో ప్రజలు ఆందోళన బాట పడుతున్నారు. స్థానిక అబాద్‌పేటకు చెందిన మహిళలు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని, కమిషనర్ ఛాంబర్ ఎదుట నిరసనకు దిగారు. తమ కాలనీలోనే ట్యాంకు ఉన్నా అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తున్నారేకాని తమకు వదలడం లేదని వాపోయారు. గొల్లపల్లి నుంచి నీరు రాకపోతే స్థానికంగా కాలనీలో ఉన్న బోర్ల నుంచైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారితో మాట్లాడటానికి వచ్చిన తెదేపా మున్సిపల్ కౌన్సిలర్ రమేష్‌తో పాటు ఇతర కౌన్సిలర్లపై మహిళలు మండిపడ్డారు. నీరు లేకపోతే తాము ఏం చేయాలని ప్రశ్నించారు. చివరకు కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్‌తో సమస్యపై చర్చించారు. అనంతరం మహిళలతో మాట్లాడి, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

హిందూపురం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా లింగన్న

హిందూపురం: హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి.లింగన్నను నియమించి పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం తాడేపల్లిగూడెంలోని సెకెండరీ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే అమలు చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న సి.రోహిల్‌కుమార్ వెంటనే ఆసుపత్రిలో సీనియర్ వైద్యుడైన లింగన్నకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించాలని అందులో పేర్కొన్నారు.

తెదేపా వర్గీయులపై వైకాపా శ్రేణుల దాడి

- ఆస్పత్రికి వెళుతుండగా అడ్డగింపు
- ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన ఫిరోజ్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆస్పత్రికి వెళుతున్న తమపై వైకాపా వర్గీయులు అకారణంగా దాడి చేశారని తెదేపా వర్గీయులు పేర్కొన్నారు. బాధితులు ఫిరోజ్, ఖాసీం తెలిపిన వివరాల మేరకు స్వగ్రామం ఎన్ఎస్‌గేట్ నుంచి వైద్యం కోసం సీకేపల్లికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నామన్నారు. సీకేపల్లి జాతీయ రహదారి కూడలిలో ఉన్న వైకాపా వర్గీయులైన ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, వెంకటరామిరెడ్డి, పవన్‌రెడ్డి, కిష్ట, మంజునాథ్, గాలి లక్ష్మీనారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అరవింద్, నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి దూర్భషలాడారన్నారు. అదే రీతిలో తాము కూడా బదులివ్వడంతో ఇనుపరాడ్లు, కట్టెలతో దాడి చేశారన్నారు. తప్పించుకుని ఆస్పత్రికి వెళ్లామన్నారు. ఫిరోజ్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఖాసీం స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానిక సీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి ప్రకటన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మీనాక్షి కోరారు. ప్రిన్సిపల్ 1, సీఆర్‌టీ 18, పీజీటీ 30, అకౌంటెంట్ 4, వార్డెన్ 5, తాత్కాలిక ఉపాధ్యాయులు 12 మొత్తం 70 పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులను 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 91005 99960 నంబరులో సంప్రదించాలని కోరారు.

నగర వనం.. చేరువలో ఆహ్లాదం

- 125 ఎకరాల్లో రూ.1.40 కోట్లతో ఎకో పార్కు


బత్రేపల్లి అటవీప్రాంతం

కదిరి, న్యూస్‌టుడే: సమాజంలో జనం ఏదోఒక పనితో ఒత్తిడికి లోనవుతున్నారు. అందుకు కొంత విరామ సమయం, మనసును ఆహ్లాదపరిచే ప్రదేశం అవసరం. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వారాంతపు సెలవులు ఇస్తున్నాయి. సమయం దొరికినా ఉల్లాసపరిచే ప్రదేశాలే కరవవుతున్నాయి. ఇందుకు అనుగుణంగా తలుపుల మండలం బత్రేపల్లి అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నగర వనం (ఎకో పార్కు) ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. 125 ఎకరాల్లో రూ.2 కోట్ల అంచనాలతో నగర వనానికి ఉపక్రమించింది. ప్రస్తుతం రూ.1.40 కోట్లతో త్వరలోనే పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయి సందర్శన మొదలైతే పర్యాటకులు, యాత్రికుల కాలక్షేపానికి ఈ ప్రాంతం నందన వనంలా అలరించనుంది.

అందరూ ఆనందించేలా పర్యాటక ప్రాంతం

కదిరిలో లక్ష్మీనృసింహస్వామి, పట్టణానికి 17 కి.మీ. దూరంలో నల్లచెరువు పాలపాటి ఆంజనేయుడి గుడి, 12 కి.మీ. దూరంలో కటారుపల్లిలో యోగివేమన సమాధి, 27 కి.మీ. దూరంలో ప్రపంచ ప్రఖ్యాత తిమ్మమ్మ మర్రిమాను ఉన్నాయి. ఆధ్యాత్మిక దర్శనానికి, చారిత్రక ప్రదేశాల సందర్శనకు నిత్యం వేలాదిగా జనం వస్తుంటారు. అయితే కొంత సమయం ఆగి కాలక్షేపం చేసేలా తగిన వసతులతో సందర్శన స్థలాలు కొరవడ్డాయి. కదిరి పట్టణంలో పరిసర పది మండలాల్లో పనిచేసే ఉద్యోగులు, సామాన్య ప్రజలు లక్షమందికి పైగా ఉన్నారు. వారాంతాల్లో ఆనందంగా గడిపేలా కాలక్షేపం కరవైంది. బత్రేపల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నగర వనంతో ఆ లోటు తీరనుంది.

త్వరలో పనులు చేపడతాం

- చక్రపాణి, జిల్లా అటవీ అధికారి

బత్రేపల్లి నగర వనానికి రూ.2 కోట్ల అంచనాలతో పనులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.1.40 కోట్లు కేటాయించారు. స్థల పరిశీలన కూడా చేశాం. ఇందులో పిల్లలు, పెద్దలు అందరూ ఆహ్లాదంగా గడిపేలా సుందరీకరణ పనులు చేడపతాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

సుందరీకరణ పనులివీ..

కదిరికి 12 కి.మీ. దూరంలోని పులివెందులకు వెళ్లే మార్గానికి ఇరువైపులా తలుపుల మండలం బత్రేపల్లి అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. నిత్యం దట్టమైన వృక్షాలతో పచ్చదనంతో నిండి ఉంటుంది. వర్షాలు భారీగా కురిసినప్పుడు బత్రేపల్లి జలపాతం కనువిందు చేస్తుంటుంది. ఇదే ప్రదేశంలోనే ఎకో పార్కును ఏర్పాటు చేయబోతున్నారు. ఇక్కడ నగర వనమంతా వీక్షించేలా వ్యూ పాయింట్, వాచ్ టవర్, అటవీ పైభాగానికి వెళ్లేందుకు ట్రెక్కింగ్ పాత్, ఆకర్షణీయమైన ఆర్నమెంటల్ గార్డెన్, పని ఒత్తిడి నుంచి ప్రశాంతతను పొందేలా యోగా సెంటర్, పిల్లలు కేరింతలకు ఆటస్థల నిర్మాణం చేపట్టనున్నారు. అంతేగాకుండా సందర్శకులను ఉల్లాసపరిచేలా జలపాతానికి సమీపంలోనే దిగువ ప్రాంతంలో బోటింగ్ సదుపాయం, సందర్శకుల ఫలహారానికి క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్ బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులు పగటి ఉష్ణోగ్రతలు 34.0 నుంచి 38.2 డిగ్రీలు గాను, రాత్రి 21.8 నుంచి 24.4 డిగ్రీలుగా నమోదయ్యే సూచనలు ఉన్నాయన్నారు. నైరుతి దిశగా గాలుల వేగం గంటకు 7 కి.మీ. వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 82 శాతం, మధ్యాహ్నం 42 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

మోదీతోనే భారత్ అన్ని రంగాల్లో అగ్రస్థానం



మాట్లాడుతున్న చిక్కబళ్లాపూర్ ఎంపీ సుధాకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మోదీ ప్రజారంజక పాలనతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా సంపన్న దేశాలు గుర్తించాయని చిక్కబళ్లాపూర్ ఎంపీ సుధాకర్, మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం భాజపా జిల్లా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై జిల్లా అధ్యక్షుడు శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మోదీ సారథ్యంలో భారత్ అన్ని రంగాల్లో ముందంజలో దూసుకెళుతోందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న ఏకైక పార్టీ భాజపానే అన్నారు. గ్రామస్థాయి నుంచి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా మీడియా కన్వీనర్, నాయకులు, నారాయణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టు ఒక్కటే.. మలుపులు ఎన్నో!



● క్రీడా కోటాలో గందరగోళం ● గ్రూపు-4 పోస్టుల భర్తీ తీరు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్-4 పోస్టుల భర్తీ వ్యవహారంలో జిల్లా అధికార యంత్రాంగం తీరు ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రభుత్వం జారీ చేసిన స్పష్టమైన జీవో, మెమోలు ఉన్నా నిర్దిష్ట నిర్ణయాలు తీసుకోవడంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తుండటంతో అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. క్రీడా కోటాలో కేటాయించిన పోస్టు భర్తీలో ఎన్ని నిర్ణయాలు.. అభిప్రాయాలు ఎందుకు తలెత్తాయో అంతుచిక్కడం లేదు. గడిచిన తొమ్మిది మాసాల్లో ఎన్నెన్నో మలుపులు తిప్పారు. ఒక స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోవడం లేదు. తాజాగా.. ఈ బాగోతం మళ్లీ మొదటికే రావడం గమనార్హం. 2021, డిసెంబరులో 63 కంప్యూటర్ కం జూనియర్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. పేపర్-1,2 ద్వారా 300 మార్కులకు రాత పరీక్ష నిర్వహించారు. కనీసం 40 శాతం(120 మార్కులు) మార్కులు వచ్చిన అభ్యర్థులే అర్హత పొందినట్లు ప్రకటించారు. 63 పోస్టుల్లో.. ఒకటి క్రీడా కోటా, మరో మూడు దివ్యాంగుల కోటా కింద భర్తీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది జనవరిలో 61 పోస్టులను భర్తీ చేశారు. వాటి వ్యవహారంలో ఎలాంటి వివాదం లేకపోయినా.. మిగిలిన రెండు దఫాలుగా ఎంపిక జాబితా రివైజ్ అయింది.

'శాప్' సిఫార్సే కీలకం

క్రీడా కోటా కింద పోస్టు భర్తీ వ్యవహారంలో తీవ్ర జాప్యం సాగుతోంది. దీనిపై జీవో 74 ప్రకారం రాత పరీక్షలో కనీసం 40 శాతం(300/120) మార్కులు పొందిన అభ్యర్థుల జాబితాను మాత్రమే క్రీడా కోటా కింద ప్రాధాన్యత నిర్ధారణ కోసం ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)కు పంపాలి. దీన్ని ఖచ్చితంగా పాటించాలి. తొలుత 1:2 కింద ఇద్దరు పేర్లను శాప్‌కు పంపించారు. అభ్యర్థి క్రీడా ప్రతిభకు సంబంధించిన పత్రాలు ఇవ్వలేదు. ఇదిలా ఒక అభ్యర్థి పత్రాలను మాత్రమే శాప్‌కు పంపించారు. తర్వాత ఈ ఏడాది జనవరి 31న క్రీడా పత్రాలను పంపించాలని నిర్దేశిత అభ్యర్థులకు సమాచారం పంపించారు. అప్పుడు నలుగురు మాత్రమే పత్రాలు పంపారు. దీనిపై ఏ నిర్ణయం తీసుకోలేదు. మళ్లీ ఈనెల 3న కలెక్టరేట్‌కు విద్యార్హత, క్రీడా పత్రాలతో రావాలని 15 మందికి సమాచారం పంపారు. సదరు 15 మందిలో తొలిసారి పంపిన అభ్యర్థి పేరు లేదు. కంప్యూటర్ పరీక్షలో ఫెయిల్ కావడం, క్రీడా పత్రాలు లేని ఓ అభ్యర్థి పేరు ఉండటం విశేషం. రాత పరీక్షలో కనీసం 40 శాతం మార్కులు పొందని, పత్రాలు కల్పిన వారి పేర్లు ఉన్నాయి.

నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం..

గ్రూప్-4 క్రీడా కోటా కింద ఉన్న పోస్టు భర్తీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం. అన్నింటినీ పక్కాగా పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం. ప్రతిభావంతులకు న్యాయం చేస్తాం. నిబంధనల ప్రకారం ముందుకెళ్తాం.

- డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుక



కూతుళ్లతో తిమ్మక్క

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ మండలం శంకరగల్లు గ్రామానికి చెందిన తిమ్మక్కకు 2023 నవంబరు 11న వందేళ్లు పూర్తయ్యాయి. ఈమె భర్త పేరు హనుమంతప్ప పదేళ్ల క్రితం మృతిచెందారు. తిమ్మక్క, హనుమంతప్ప దంపతులకు 12 మంది సంతానం. ఆరుగురు మగ, 6 మంది ఆడ పిల్లలు. వీరికి 30 మంది సంతానం. ప్రస్తుతం పెద్ద కుమారుడు 85 సంవత్సరాలు. తిమ్మక్క ప్రస్తుతం 101 సంవత్సరాలు. అయినా ఒకరిపై ఆధారపడకుండా అన్ని పనులు సొంతంగా చేసుకుంటుంది.

ఆదరణ చిట్‌ఫండ్ నిర్వాహకుల ఆస్తుల జప్తు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరిట డబ్బులు సేకరించి, వాటి మెచ్యూరిటీ కాలం ముగిసినా వెనక్కి చెల్లించలేదనే కారణంతో అనంతపురం నగరంలోని 'ఆదరణ చిట్ ఫండ్స్' నిర్వాహకులకు సంబంధించిన ఆస్తులను ప్రభుత్వం అటాచ్‌మెంట్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ పేరిట మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. చిట్ ఫండ్ చైర్మన్ రామకృష్ణ, ఆతని భార్య వైస్ చైర్‌పర్సన్ శైలజారాణితో పాటు, తండ్రి అశ్వర్థకు చెందిన స్థిర, చర ఆస్తులను అటాచ్ చేశారు. వీరిలో రామకృష్ణ పేరిట ఉన్న భూములు, కార్లు, బ్యాంకు బ్యాలెన్స్‌లు రూ.1,41,78,724, శైలజారాణి పేరిట ఉన్న వ్యవసాయ భూములు, అనంతపురం, హిందూపురంలో ఉన్న ఆస్తులు, బ్యాంక్ బ్యాలెన్సులు మొత్తం రూ.1,94,19,190, తండ్రి అశ్వర్థ పేరు మీదున్న రూ.5,92,000 వ్యవసాయ భూమి, పాలిటెక్నికల్ కళాశాల కింద ఉన్న బ్యాలెన్సు రూ.4,79,754 వెరసి ఆస్తుల విలువ మొత్తం రూ.3,46,69,668ను అటాచ్ చేశారు. నగరంలో పలువురి వద్ద నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి డిపాజిట్లు చేశారు. వాటికి మెచ్యూరిటీ తీరినా తిరిగి చెల్లించలేదు. 2022 ఆగస్టులో పలువురు డిపాజిటర్లు నగరంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో ఆదరణ చిట్ ఫండ్ నిర్వాహకుల పైనా ఫిర్యాదులు చేశారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20 వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ట్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని, మామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డుకు ఎమ్మెల్యే ఎంపిక



లండన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అమిలినేని

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో నిర్మాణ రంగం, సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నతంగా నిర్వహిస్తున్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ చైర్మన్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రతిష్ఠాత్మకమైన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ విశ్వవిద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడున్న బడుగు బలహీనవర్గాల స్ఫూర్తిదాత దాదాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా ఎన్నారై హౌస్ ఆఫ్ సొసైటీ ఆధ్వర్యంలో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో గ్లోబల్ ఇండియన్స్ వారు అందజేసే ప్రతిష్ఠాత్మకమైన మహాత్మా గాంధీ లీడర్‌షిప్ అవార్డును ఎమ్మెల్యే అందుకోనున్నారు. ఎంచుకొన్న రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించిన, సమాజానికి విశిష్ఠ సేవలు అందించిన 125 మందిని పైగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికపై నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికయిన విద్యార్థులతో పీడీ నాగరాజు

అనంతపురం క్రీడలు, ఆత్మకూరు: రాష్ట్ర పాఠశాల క్రీడల అండర్-17, 19 విభాగాల్లో జరిగే ఈత పోటీలకు అనంత ఉత్తమ పాఠశాల విద్యార్థులు పలువురు ఎంపికయ్యారు. తుర్లలో శిక్షణ కేంద్రంలో జరుగుతున్న పోటీలకు మొత్తం 8 మంది ఈ పాఠశాల నుంచి ఎంపిక కావడం విశేషం. అండర్-17 విభాగంలో పి. యశస్విని, సి.సుజన, శిరీష, బాలుర విభాగంలో ఈశ్వర్, ప్రణయ్, అండర్-19 బాలికల విభాగంలో కీర్తన, రెడ్డి జ్యోత్స్న, రిషితలు ఎంపికయ్యారు. క్రీడాకారులను పాఠశాల చైర్మన్ అనంతరాముడు, డీన్ పీవీ నరసింహారావులు అభినందించారు.

అండర్-19 హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు..

ఆత్మకూరు మండలం సనప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అండర్-19 హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ నాగరాజు తెలిపారు. మంగళవారం అనంతపురం ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారని అన్నారు. అండర్-19 విభాగంలో నందకిషోర్, ప్రతాప్, పవన్ కుమార్, నవనీత, శైలజ, రజిత, జ్యోష్ణ, భారతి, సమంత ఎంపికయ్యారన్నారు. వీరు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నట్లు చెప్పారు.

ప్రైవేటు మద్యం దుకాణాలకు ఆహ్వానం



వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఈఎస్ రామమోహన్ రెడ్డి, ఏఈఎస్‌లు శ్రీరామ్, రేవతీ సుబ్రహ్మణ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన అబ్కారీ విధానం.. 2024కి సంబంధించి రాష్ట్రంలో నోటిఫికేషన్ విడుదలైనట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. ఆయన మంగళవారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. నూతన విధానం ప్రకారం దుకాణాల అనుమతుల కోసం లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనడానికి రూ.2లక్షల (తిరిగి చెల్లించని) రుసుముతో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకునేది ఎలా?

మద్యం దుకాణాలు దరఖాస్తు చేసుకోవడానికి మూడు పద్ధతులు అనుసరించవచ్చు. ఆన్‌లైన్ పద్ధతి, హైబ్రిడ్ పద్ధతి, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తులు పంపవచ్చు. 'హెచ్‌పీఎఫ్ఎస్‌ప్రాజెక్ట్.కామ్' అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో చేసుకునేవారు వారి పేరు, గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, చిరునామా, తదితర వివరాలు నమోదు చేసి, రుసుమును ఆన్‌లైన్ ద్వారానే చేయవచ్చు. హైబ్రిడ్ పద్ధతిలో వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రుసుము చెల్లింపులు 'ఈ చలానా సంఖ్యను జనరేట్ చేసుకుని స్టేట్ బ్యాంకు బ్రాంచిల్లో చెల్లించవచ్చు. అలాగే ఆఫ్‌లైన్‌లో డిమాండ్ డ్రాఫ్ట్ బ్యాంకు నుంచి తీసుకుని జిల్లాలోని ఏ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా సమర్పించవచ్చు. ఈ డీడీ ఏపీలో ఉన్న బ్యాంకుల్లో మాత్రమే డ్రా చేయాలి. డిమాండ్ డ్రాఫ్టులు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) పేరు మీద తీయాలి.

లక్కీ డ్రా తీసే ప్రదేశాలు ఇవి

ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. లాటరీ 11న తీస్తారు. అనంతపురం జిల్లాకు సంబంధించి లాటరీని కలెక్టరు కార్యాలయంలోని రెవెన్యూ భవనం, శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తిలోని గణేశ్ కూడలిలో సాయి ఆరామం ఫంక్షన్ హాల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారు 'ఆయా మండలాలు, పట్టణాలకు కేటాయించిన 'రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్'లో ఆరో వంతు చెల్లించాలి.

నిర్మాణాల కూల్చివేతలో 10 మందిపై కేసు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద సోమవారం నిర్మాణాలను హిటాచీ యంత్రంతో కూల్చివేసిన ఘటనపై మంగళవారం ధర్మవరం 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తమకు చెందిన నిర్మాణాలను అక్రమంగా కూల్చివేశారని ఎలక్ట్రికల్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భాజపా నాయకులు గొడుగు నాగరాజు, సోమశేఖర్, ఎం.నాగరాజుతో పాటు ఎలక్ట్రికల్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్‌లోని మరో వర్గానికి చెందిన గోవిందరాజులు, బాబావలీ, తాజుద్దీన్, రమేష్, వినోద్, ఆంజనేయులు, రాముపై కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.


ధర్మవరం పట్టణం: ప్లంబర్స్ నిర్మించుకున్న పునాదులు, షెడ్లను కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు ఆర్థిక నష్టం జరిగిందని తెలిపారు.

అడిగినంత ఇవ్వకపోతే అంతుచూస్తా..

కళ్యాణదుర్గంలో వైద్యురాలిని బెదిరించిన ఆగంతుకుడు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ క్లినిక్‌లో ఉన్న వైద్యురాలిని డబ్బు కోసం గుర్తు తెలియని వ్యక్తి బెదిరించిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటన కళ్యాణదుర్గం పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. ఈ మేరకు బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు.. మూడ్రోజుల కిందట సాయంత్రం వైద్యురాలు క్లినిక్‌లో ఉన్న సమయంలో ఆగంతకుడు ముసుగు వేసుకొని ఆమె గదిలోకి వచ్చాడు. ఆమెను కుర్చీలో ప్లాస్టర్‌తో కట్టేసి డబ్బు ఇవ్వకపోతే నీకథ చూస్తానంటూ బెదిరించాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని హెచ్చరించాడు. తనకు కోటి రూపాయలు ఇవ్వాలని బెదిరించాడని, కొద్ది రోజుల్లో వస్తానని డబ్బు సిద్ధం చేసుకోవాలని చెప్పి జారుకున్నాడు. కొంతసేపటికీ వైద్యురాలు కుర్చీలో నుంచి కింద పడగానే క్లినిక్‌లో ఉన్న సిబ్బంది, పక్క దుకాణంలో ఉన్నవారు అక్కడికి చేరుకొని వివరాలు అడిగారు. తనను ఓ వ్యక్తి డబ్బు కోసం బెదిరించాడని వైద్యురాలు తెలిపారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ వెంకటరమణ సిబ్బందితో ప్రైవేట్ క్లినిక్‌ను పరిశీలించారు. ఎక్కడా నిఘా నేత్రాలు లేకపోవడంతో పలుచోట్ల ఆరా తీశారు. అక్కడే ఉన్న పలు దుకాణాదారుల నుంచి వివరాలు తెలుసుకొన్నారు. రాయదుర్గంలోని బంధువుకు చెందిన వ్యక్తి వచ్చి తనను బెదిరించినట్లు బాధితురాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి




కిష్టప్ప

చాలకూరు(సోమందేపల్లి), న్యూస్‌టుడే: వ్యవసాయ పంటల సాగు చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకొంటున్న రైతు చివరకు ఆ పంట పొలంలోనే ప్రాణాలు విడిచిన విషాద ఘటన సోమందేపల్లి మండలం చాలకూరులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి ఎస్సై రమేశ్‌బాబు చెప్పిన వివరాలిలా.. రైతు జి.కిష్టప్ప(56)కు మెట్ట పొలం రెండున్నర ఎకరాలు ఉండగా బోరు బావి తవ్వించుకోగా పుష్కలంగా నీరు లభ్యమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులతో కలసి వరి, మల్బరీ, మొక్కజొన్న సాగు చేస్తూ, మంచి దిగుబడులు సాధిస్తూ తమ కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. ఇరువురు కుమార్తెలకు వివాహాలు చేశారు. రోజు లాగే మంగళవారం సాయంత్రం పంటకు నీరు పెట్టడానికి బోరుబావి వద్ద ఉన్న స్టార్టర్ పెట్టెలో స్విచ్‌ను వేయగా రైతు ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. సమీపంలోనే మల్బరీ ఆకు కోస్తున్న కుమారుడు వెంకటేశులు తన తండ్రి బోరుబావి వద్ద నుంచి రాలేదని వెళ్లి చూసి కేకలు వేస్తూ రోదించాడు. చుట్టుపక్కల రైతులు, పెదనాన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొన్నారు. ఈ సమాచారంతో భార్య రామాంజనమ్మ, కుమార్తెలు లింగమ్మ, అశ్వని చేరుకొని బోరున విలపించారు. ఎస్సై ఆధ్వర్యంలో ఏఎస్సై మురళీమోహన్ తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ముగ్గురికి తీవ్ర గాయాలు



బొమ్మన్న

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం-కణేకల్లు ప్రధాన రహదారిలోని టి.వీరాపురం గ్రామ సమీపాన దొణ గంగమ్మ ఆలయం వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా.. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన బొమ్మన్న (55), ఆయన భార్య సత్యమ్మ కర్ణాటకలోని గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో నెల పరుష ఉత్సవాల్లో పాల్గొని ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. అదే సమయంలో టి.వీరాపురం గ్రామానికి చెందిన హెచ్.ఆంజనేయులు, అతడి స్నేహితుడు గురుస్వామిలు ద్విచక్ర వాహనంలో రాయదుర్గం వెళ్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు దొణ గంగమ్మ ఆలయం వద్ద ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బొమ్మన్న మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ముగ్గురిని రాయదుర్గం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రాథమిక చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం సీఐ జయనాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. Website: www.shriramfinance.in

బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 1-4-12, 1వ అంతస్తు, బి.ఎస్.టి. ఫిల్లింగ్ స్టేషన్ ప్రక్కన, హిందూపూర్, శ్రీ సత్యసాయి జిల్లా - 515201

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్పబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిస్టర్డు ఆఫీసును మరియు బ్రాంచి ఆఫీసు చిరునామా : డి.నెం. 1-4-12, 1వ అంతస్తు, బి.ఎస్.టి. ఫిల్లింగ్ స్టేషన్ ప్రక్కన, హిందూపూర్, శ్రీ సత్యసాయి జిల్లా - 515201 లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర. సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	**1) సిద్దేశ్వర ఎంటర్‌ప్రైజెస్, ప్రొ॥ జి.ఎన్. తిప్పేస్వామి,** తండ్రి : డి. నాగేంద్రప్ప, వయస్సు : 37 సం॥లు, చిరునామా : డి.నెం. 1-1388, ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, అమరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) - 515281. బిస్సులు : సిద్దేశ్వర ఎంటర్‌ప్రైజెస్. **2) జి.ఎన్. పుష్పలత,** భర్త : జి. పాపి గౌడ, వయస్సు : 34 సం॥లు, చిరునామా : డి.నెం. 6-121, హుడుగూర్, అమరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) - 515281.	08-03-2024 / Rs. 2,25,00,000/-	29-08-2024 / ది. 29-08-2024 నాటికి రూ. 3,06,28,606/- (అక్షరాలా మూడు కోట్ల ఆరు లక్షల ఇరవై ఎనిమిది వేల ఆరు వందల ఆరు రూపాయలు మాత్రమే)లోన్ అగ్రిమెంట్ నెం. HDPURTF2204220004

3) జి. పాపి గౌడ, తండ్రి : లేటు జి. మారి గౌడ, వయస్సు : 49 సం॥లు, చిరునామా : డి.నెం. 6-121, హుడుగూర్, అమరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) - 515281. **4) ఆర్. సుమ,** భర్త : జి.ఎన్. తిప్పేస్వామి, వయస్సు : 32 సం॥లు, చిరునామా : డి.నెం. 1-1388, ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, అమరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) - 515281. **5) కె. నరసింహమూర్తి,** తండ్రి : కె. కరియన్న, వయస్సు : 70 సం॥లు, చిరునామా : డి.నెం. 1-461-1, జడ్.పి.హెచ్. స్కూల్ ప్రక్కన, చోళమాంబ వీధి, అమరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) - 515281.

ఆస్తి వివరములు : షెడ్యూల్-1 : ఐటమ్ నెం. 1 : (జి.ఎన్. పుష్పలత గారికి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం. 614/2008) సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపూర్ జిల్లా), హిందూపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, మడకశిర సబ్ డిస్ట్రిక్ట్, అమరాపురం గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, సర్కార్ డ్రై సర్వే నెం. 631/ఎ వద్ద ఎకరా 1.18 సెంట్ల భూమిని ఇంటి ప్లాట్స్ గా కన్వర్ట్ చేయగా అందలి లేఅవుట్ కి చెందిన ప్లాట్ నెంబర్లు 25 మరియు 26 (7వ వార్డు 1-1388). **హద్దులు : తూర్పు :** తిమ్మయ్య మరియు ఇతరుల రూమ్, **పడమర :** 15 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** ప్లాట్ నెం. 27, **దక్షిణం :** 20 అ॥ వెడల్పు రోడ్డు, పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు 20 అ॥ లేదా 6.09 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 24 అ॥లు లేదా 7.31 మీటర్లు మొత్తం కలుపగా 480 చ॥అ॥లు లేదా 53.33 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము అందలి ఆర్‌సిసి బిల్డింగ్ మాత్రమే.

ఐటమ్ నెం. 2 : (జి. పాపి గౌడ, తండ్రి లేటు మారి గౌడ గారికి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం. 3289/2019) సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపూర్ జిల్లా), హిందూపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, మడకశిర సబ్ డిస్ట్రిక్ట్, అమరాపురం గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, వార్డు నెం. 1, సర్కార్ డ్రై సర్వే నెం. 405/బి వద్ద ఎకరా 1.76 సెంట్లు మరియు సర్కార్ డ్రై సర్వే నెం. 648/1బి వద్ద ఎకరా 0.35 సెంట్లు, రెండూ కలుపగా ఎకరా 2.11 సెంట్ల విస్తీర్ణంలోని భూమిని ఇంటి ప్లాట్స్ గా కన్వర్ట్ చేయగా అందలి లేఅవుట్ ప్లాట్ నెం. 22 **హద్దులు : తూర్పు :** 20 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం. 15కి చెందిన ఖాళీ స్థలము, **ఉత్తరం :** ప్లాట్ నెం. 23కి చెందిన ఖాళీ స్థలము, **దక్షిణం :** 30 అ॥ వెడల్పు రోడ్డు, పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు 40 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 30 అ॥లు మొత్తం కలుపగా 133.3 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే.

ఐటమ్ నెం. 3 : (జి.ఎన్. తిప్పేస్వామి గారికి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం. 3288/2019) సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపూర్ జిల్లా), హిందూపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, మడకశిర సబ్ డిస్ట్రిక్ట్, అమరాపురం గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, వార్డు నెం. 1, సర్కార్ డ్రై సర్వే నెం. 405/బి వద్ద ఎకరా 1.76 సెంట్లు మరియు సర్కారు డ్రై సర్వే నెం. 648/1బి వద్ద ఎకరా 0.35 సెంట్లు రెండూ కలుపగా ఎకరా 2.11 సెంట్లు విస్తీర్ణంలోని భూమిని ఇంటి ప్లాట్స్ గా కన్వర్ట్ చేయగా అందలి గల ఖాళీ స్థలము. **హద్దులు మరియు కొలతలు (1) ఆస్తి : తూర్పు :** 20 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** సిరా - అమరాపురం రోడ్డు, **ఉత్తరం :** సతీష్‌గారి భూమి, **దక్షిణం :** 30 అ॥ వెడల్పు రోడ్డు, పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు ఉత్తరం వైపున 55 అ॥, తూర్పు నుండి పడమరకు దక్షిణం వైపుకు 64 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు రెండు వైపులా 89 అ॥. మొత్తం కలుపగా 588.3 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే. **హద్దులు మరియు కొలతలు (2) ఆస్తి : తూర్పు :** 20 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** సిరా - అమరాపురం రోడ్డు, **ఉత్తరం :** 30 అ॥ వెడల్పు రోడ్డు, **దక్షిణం :** వసురప్ప గారి భూమి. పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు 80 అ॥, మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 90 అ॥. మొత్తం కలుపగా 800 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే.

షెడ్యూల్-2 : ఐటమ్ నెం. 1 : (జి.ఎన్. తిప్పేస్వామి గారికి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం. 3050/2019) సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపూర్ జిల్లా), హిందూపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, మడకశిర సబ్ డిస్ట్రిక్ట్, అమరాపురం గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, వార్డు నెం. 1, సర్కార్ డ్రై సర్వే నెం. 635/1బి వద్ద ఎకరా 0.58 సెంట్లు మరియు సర్కారు డ్రై సర్వే నెం. 635/2ఇ వద్ద ఎకరా 0.52 సెంట్లు రెండూ కలుపగా ఎకరా 1.10 సెంట్లు విస్తీర్ణంలోని భూమిని ఇంటి ప్లాట్స్ గా కన్వర్ట్ చేయగా అందలి లేఅవుట్ ప్లాట్ నెం. 12ఎ. **హద్దులు : తూర్పు :** రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం. 12కి చెందిన ఖాళీ స్థలము, **ఉత్తరం :** సురేష్ మరియు ఇతరులకు చెందిన ఖాళీ స్థలము, **దక్షిణం :** 20 అ॥ వెడల్పు రోడ్డు, పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు ఉత్తరం వైపున 22 అ॥. తూర్పు నుండి పడమరకు దక్షిణం వైపున 5 అ॥ లేదా 6.09 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణంకు తూర్పు వైపున 43 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు పడమరవైపున 40 అ॥. మొత్తం కలుపగా 62.25 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే.

ఐటమ్ నెం. 2 : (జి.ఎన్. తిప్పేస్వామి గారికి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం. 3050/2019) సత్యసాయి జిల్లా (పూర్వపు అనంతపూర్ జిల్లా), హిందూపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, మడకశిర సబ్ డిస్ట్రిక్ట్, అమరాపురం గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, వార్డు నెం. 1, సర్కార్ డ్రై సర్వే నెం. 635/1బి వద్ద ఎకరా 0.58 సెంట్లు మరియు సర్కారు డ్రై సర్వే నెం. 635/2ఇ వద్ద ఎకరా 0.52 సెంట్లు రెండూ కలుపగా ఎకరా 1.10 సెంట్లు విస్తీర్ణంలోని భూమిని ఇంటి ప్లాట్స్ గా కన్వర్ట్ చేయగా అందలి లేఅవుట్ కి చెందిన ప్లాట్ నెం. 12. **హద్దులు : తూర్పు :** 20 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం. 11కి చెందిన ఖాళీ స్థలము, **ఉత్తరం :** సురేష్ మరియు ఇతరులకు చెందిన ఖాళీ స్థలము, **దక్షిణం :** 20 అ॥ వెడల్పు రోడ్డు, పైన తెలిపిన స్థలము తూర్పు నుండి పడమరకు 25 అ॥. మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 40 అ॥ మొత్తం కలుపగా 111.11 చ॥గ॥ ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే. **పైన తెలిపిన రెండు ఐటమ్స్ నందు నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ దానికి చెందిన అన్ని ఫిక్చర్స్ మరియు సౌలభ్య హక్కులతో సహా స్థలము.**

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అస్సెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : హిందూపూర్ సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఉపాధ్యాయ పోస్టులు సాధించి గుర్తింపు తేవాలి

మడకశిర, న్యూస్‌టుడే: ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొందిన అభ్యర్థులు పరీక్షలు బాగా రాసి అత్యధిక మంది ఉపాధ్యాయులుగా ఎంపికై మంచి గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. రెండు నెలలుగా ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్వహించిన డీఎస్సీ ఉచిత కోచింగ్ శిక్షణ మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా చివరి రోజు అభ్యర్థులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనాలు వడ్డించి శుభాకాంక్షలు తెలియజేశారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్, కౌన్సిలర్ రాజా, మండల కన్వీనర్లు మద్దనకుంటప్ప, కుమారస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నాగార్జున



హిందూపురం, న్యూస్‌టుడే: జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి నాగార్జున కర్ణాటకం ఆంధ్రాచెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ పరిశీలకుల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రంలో చెస్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సంఘం సభ్యులతో కలిసి కృషి చేస్తానన్నారు.

సరిహద్దు దాటుతున్న స్వర్ణముఖి ఇసుక



రామాపురం వద్ద ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

అగళి, మడకశిర, న్యూస్‌టుడే: అగళి మండలంలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక సరిహద్దు ఎటు వెళ్లినా రెండు కిలోమీటర్లలోపే ఉండడంతో సరిహద్దు దాటించడం అక్రమార్కులు శులభతరమైంది. సరిహద్దు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు అని చెప్పి మద్య


యథేచ్ఛగా అక్రమ రవాణా.. స్పందించని అధికారులు

రాత్రి గుట్టుచప్పుడు కాకుండా బెంగళూరు, తుమకూరు, శిరా తదితర పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం మండలంలోని రామాపురం వద్ద అనుమతి లేకుండా నాలుగు ట్రాక్టర్లలోఇసుకను యథేచ్ఛగా కర్ణాటకకు తరలించడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టించుకోని ఇసుకాసురులు అడ్డగోలుగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగిస్తూ అక్రమ రవాణా సాగిస్తూనే ఉన్నారు.

ఈ గ్రామాల నుంచే ఎక్కువగా..

అగళి, ఆర్‌జీ.పల్లి, రామాపురం, ఇరిగేపల్లి, మధూడి, కదిరేపల్లి పరిసరాల్లో ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్లతో నది నుంచి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో ట్రాక్టర్ల యజమానులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిత్యం కర్ణాటకకు..



సరిహద్దు నుంచి నిత్యం ట్రాక్టర్‌లో నింపుకొని కర్ణాటకకు తరలిస్తున్నారు. నదిలో ఇసుక ఖాళీ అవుతోంది. దీంతో భూగర్భ జలం పూర్తిగా పడిపోయి ఎండా కాలంలో బోరుబావుల్లో నీరు రావడం లేదు. పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఎదుర్కొంటున్నాం. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి.

- జగన్నాథ్. రైతు స్థానికుడు

తరలిస్తే జప్తు చేస్తాం

మండలంలోని ఇసుకను కర్ణాటకకు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయి. వెంటనే సంబంధిత ట్రాక్టర్‌ను జప్తు చేసి, కేసు నమోదు చేస్తాం.

- కె.వీరేష్, ఎస్ఐ, అగళి

మహిళల ఆర్థికాభివృద్ధికి దుస్తుల పరిశ్రమలు



భూమిపూజ చేస్తున్న మంత్రి, తెదేపా నాయకులు

రొద్దం, న్యూస్‌టుడే: పెనుకొండ నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం దుస్తుల పరిశ్రమల ఏర్పాటుకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మంగళవారం రొద్దం మండలంలోని తురకలాపట్నం వద్ద పెద్దిపల్లి గ్రామానికి రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. తొలుత పలువురి వృద్ధులకు పింఛన్లు ఆమె అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం తిరిగి పూర్వవైభవం సాధిస్తుందన్నారు. రొద్దం మండలానికే 73 పనులకు గానూ రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశామని మంత్రి సవిత చెప్పారు. అధికారులతోపాటు గ్రామ సర్పంచి పరమేశ్, మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికారప్రతినిధి నరసింహులు, సీనియర్ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి తొమ్మిది, పదకొండు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిది, పదో తరగతి చదువుతున్న వారై ఉండాలన్నారు. బుధవారం నుంచి ఈ నెల 30వతేదీ వరకు ఆన్‌లైన్లో ఎటువంటి రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

దారి సమస్య పరిష్కరించాలని వినతి

గోరంట్ల: పాలసముద్రం దళితవాడ ప్రజలు ఎదుర్కొంటున్న శ్మశానవాటిక దారి సమస్యను పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం మంత్రి సవితకు పెనుకొండలో వినతిపత్రం అందజేశారు. అలాగే సత్యమ్మగుడి నిర్మాణానికి, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని కోరారు. తెదేపా నాయకులు ఉడయకుమార్, మల్లికార్జున, సంజీవప్ప, సుధాకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

లేపాక్షి: ఇళ్లులేని ప్రతి నిరుపేదకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శిమప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి సీపీఐ నాయకులు కలిసి ఈ మేరకు వినతి అందించారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలి

హిందూపురం: విద్యార్థులు సైన్స్‌పట్ల అవగాహన పెంచుకొని ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక జోనల్ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆల్‌హిలాల్ పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోనూ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రొద్దం పోలీస్‌స్టేషన్ తనిఖీ

రొద్దం: పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం రొద్దం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పని చేస్తున్న సిబ్బంది వివరాలను హెడ్‌కానిస్టేబుల్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు.

ఉప తహసీల్దార్‌గా రెడ్డిశేఖర్

సోమందేపల్లి : సోమందేపల్లి ఉప తహసీల్దార్‌గా రెడ్డిశేఖర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గోరంట్ల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెనుకొండ : వారం రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోతన్న(65) అనే వృద్ధుడు సోమవారం రాత్రి కర్నూల్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుట్టూరు గ్రామానికి చెందిన పోతన్న 44వ జాతీయ రహదారిపై గత బుధవారం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ఆటో ఢీకొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొళ్ల, న్యూస్‌టుడే: రొళ్ల మండలంలోని గుడ్డుగుర్కి గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆవినకుంట గ్రామం దిలీప్, లక్ష్మీదేవిలు ద్విచక్ర వాహనంలో గుడ్డుగుర్కి వెళుతుండగా అగళికి చెందిన నటరాజ్ గొట్టగుర్కి గ్రామం నుంచి ఎదురుగా వస్తూ బలంగా ఢీకొన్నారు. నటరాజ్, దిలీప్‌లకు గాయాలయ్యాయి. వీరిని శిర ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పిన లారీ

హిందూపురంగ్రామీణం: బెంగుళూరుకు వెళ్లే రహదారిలో తూముకుంట చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంకాలం వెళుతున్న మినీ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న రెండు ద్విచక్రవాహనాలపై దూసుకువెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. గ్రామీణ పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మద్యం తాగి వాహనం నడపడంతోనే ఇలా జరిగిందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మడకశిర గ్రామీణం: మడకశిర మండలం గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కృష్ణవేణి మంగళవారం అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర, పీఈటీ అరుణ తెలిపారు. అదేవిధంగా కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.చరణ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు పీఈటీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



సిబ్బందితో చర్చలు జరుపుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం పట్టణం: హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న 11 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆబ్కారీ శాఖ సీఐ లక్ష్మీదుర్గయ్య పేర్కొన్నారు. ఈ దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల చెల్లింపు తదితర విషయాలపై డిజిటల్ అసిస్టెంట్లు, బ్యాంకుల అధికారులతో, ఎక్సైజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఆరు, పరిగిలో 2, చిలమత్తూరు, లేపాక్షి, కిరికెరలో ఒక్కొక్కటి చొప్పున దుకాణాల ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. లేపాక్షిలోని దుకాణానికి రూ.55 లక్షలు, మిగిలిన వాటికి రూ.65 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దుకాణాలను చేజిక్కించుకోవడానికి ఎన్ని దరఖాస్తులైనా వేయవచ్చని, ఒక్కొక్క దరఖాస్తుకు రూ.2 లక్షలు తిరిగి ఇవ్వని రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. 11వ తేదీన పుట్టపర్తిలో లాటరీ నిర్వహిస్తామని వివరించారు. ఎస్ఐలు పృధ్వీరాజ్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి తదితరులు

గుడిబండ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. గుడిబండ మండలం రాళ్లపల్లి, కేకాతి గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెలా 1న టంచన్‌గా పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. రాళ్లపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి, కేకాతిలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాళ్లపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య, సీసీ దారుల సమస్య ప్రజలు తెలపగా సత్వరమే పరిష్కరిస్తామన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా లింగాయతల అధ్యక్షుడు దుర్గేశ్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: పరిగిలోని మండల కాంప్లెక్స్ ఆవరణలోని ట్యాంకును శుభ్రం చేయించాలి. **- నాగరాజు**
సమాధానం: శుభ్రం చేయించేందుకు చర్యలు.
- సరస్వతి, ఎంపీడీవో
–న్యూస్‌టుడే, పరిగి

సమస్య : చౌటిపల్లిలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. **- రాజు**
సమాధానం : మురుగు రాకుండా చూస్తాం. **- మురళీధర్, మున్సిపల్ ఏఈ, మడకశిర**

సమస్య : హెచ్.ఆర్‌పాళ్యం రహదారి గుంతలమయం. **- నాగేంద్ర**
సమాధానం : పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- మురళి, పీఆర్ డీఈ, మడకశిర**
–న్యూస్‌టుడే, మడకశిర

చెస్‌లో పురం క్రీడాకారుల ప్రతిభ

హిందూపురం, న్యూస్‌టుడే: బెంగళూరులో సెప్టెంబరు 22న ఆల్ ఇండియా ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హిందూపురానికి చెందిన చెస్ క్రీడాకారులు జి.జ్ఞాపికా రెడ్డి,(1532), వి.విష్ణుకిరణ్ (1463), సి.మిథున్‌పెద్దన్న(1455) అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ సాధించారని చెస్ కోచ్ ఆరిపుల్లా తెలిపారు.

మంజమ్మకు ఎస్పీ అభినందనలు



హిందూపురం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ మంజమ్మను జిల్లా ఎస్పీ రత్న అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని అభినందించారు. ఈ సందర్భంగా మంజమ్మను రివార్డుకు ఎంపిక చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పుట్టపర్తి ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆవులశ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథ కల్యాణ మండపం భూమి పూజకు ఎంపీకి ఆహ్వానం



ఎంపీ బీకే పార్థసారథిని సత్కరిస్తున్న సగర సంఘం నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లిలో ఈనెల 7న నిర్వహించనున్న భగీరథ కల్యాణ మండపం భూమి పూజా కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీ బీకే పార్థసారథిని ఉప్పర/సగర సంఘం నాయకులు, కులస్థులు మంగళవారం ఆహ్వానించారు. అనంతపురంలోని స్వగృహంలో ఆయన్ను కలిసిన నాయకులు గోపాల్, అంజనప్ప, రామచంద్ర, శివశంకర్ తదితరులు రావాలని కోరారు.

ఎంపీని కలిసిన డీఎస్పీ

పెనుకొండ, న్యూస్‌టుడే: హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

లేపాక్షి: రైతులు పంట సాగులో అధికారులు సూచించే సస్యరోణా చర్యలు చేపడితే పంటను తెగుళ్ల నుంచి కాపాడవచ్చని హిందూపురం డివిజన్ వ్యవసాయ సంయుక్త సంచాలకుడు అల్తాఫ్‌అలీఖాన్ సూచించారు. మండలంలోని నాయనిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కజొన్న పంటకు ఆశించు కత్తెర పురుగు నివారణా చర్యలు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయాధికారిణి శ్రీలత, పశువైద్యాధికారిణి జయశ్రీ, పట్టుపరిశ్రమ అధికారి చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, పుష్పలత, పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్

గుడిబండ: రైతులు కంది, వేరుసెనగ, రాగి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి వీరనరేశ్ సూచించారు. మండలంలోని శంకరగల్లు, రాళ్లపల్లి రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

నీరు రాక ఏడాది..



కదిరేపల్లి బస్టాండు కూడలిలో ఏడాదిగా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కుళాయిల్లో నీరు రావడం లేదు. గతంలో ఈ నీరు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ విషయమై శ్రీరామరెడ్డి తాగునీటి పథకం సూపర్‌వైజర్ మారుతి మాట్లాడుతూ కుళాయిలకు నీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

అంగన్‌వాడీ భవనం ఆగింది



ఆర్.వద్రహట్టిలో అంగన్‌వాడీ భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగింది. నిధులు సరిపోలేదని గుత్తేదారు పనులు ఆపేసి 8 ఏళ్లవుతోంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు కాలం గడిపింది. ఇప్పటికైనా పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సూపర్‌వైజర్ సన్నమ్మను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, రొళ్ల**

ప్రమాదకర ప్రయాణం



మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలో 20 మందికి పైగా ప్రయాణించడం వల్ల ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం పట్టణంలోని మధుగిరి రోడ్డు నుంచి రాజీవ్‌గాంధీ కూడలి మీదుగా విద్యార్థులు ఆటోలో రెండు వైపులా వేలాడుతూ ప్రయాణించారు. విద్యార్థులు జర ఆలోచించండి ఇలాంటి ప్రయాణం ప్రమాదం. **-న్యూస్‌టుడే, మడకశిర**

అభివృద్ధి పనులకు అడుగులు

రూ.31 లక్షలతో ప్రహరీ, భవనానికి మరమ్మతులు



సోమందేపల్లి: జిల్లా పరిషత్తు పాఠశాల బాలికల వసతి గృహం వద్ద ప్రహరీ నిర్మాణం కోసం తవ్వించిన పిల్లర్ల గుంతలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ పనులు పూర్తయినా ఏడాదిన్నర కాలంగా నిరుపయోగంగా ఉన్న సోమందేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బాలికల వసతి గృహానికి మంత్రి కృషితో ఎట్టకేలకు మోక్షం లభించింది. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితిలో చీకట్లో మగ్గుతున్న వసతి గృహంలో త్వరలోనే విద్యుత్తు వెలుగులు విరజిమ్మ నున్నాయి. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో జడ్పీ పాఠశాలకు అనుబంధంగా బాలికల వసతి గృహం నిర్మాణానికి రూ.1.92 కోట్లు మంజూరు చేసింది. పనుల ప్రారంభంలో అలస్యం కావడం..అనంతరం కరోనా మహమ్మారి విజృంభణ కారణంగా నిర్మాణ పనులు రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ పర్యవేక్షణలో నత్తనడకన కొనసా..గుతూ చివరకు గతేడాది విద్యా సంవత్సరానికి ముందే పూర్తయ్యాయి. అయినా ప్రారంభోత్సవానికి నోచుకోక నిరుపయోగంగా మారిన వసతి గృహం, చివరకు విద్యుత్తు బిల్లులు చెల్లించలేని దుస్థితిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమైనా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

మంత్రి స్పందనతో మోక్షం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో మంత్రి సవిత స్పందించారు. ప్రస్తుతం రూ.31 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రహరీ నిర్మాణం, వసతి గృహంలో అల్లరిమూకల కారణంగా దెబ్బతిన్న మరుగుదొడ్లు, నీటి కుళాయిలు, విద్యుత్తు తీగలు, పైపులను పగుల గొట్టడంతో వాటి మరమ్మతు పనులకు మంత్రి ఇటీవలే భూమిపూజ చేశారు. గుత్తేదారు ఆంజనేయులు త్వరితగతిన ప్రహరీ నిర్మాణం, భవనంలోపల మరమ్మతు పనులను ఇన్‌ఛార్జి హెచ్ఎం నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో చేయిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా పేద విద్యార్థినుల విద్యాభివృద్ధికి ఈవసతి గృహాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొంటామని మంత్రి సవిత 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దీంతో పాఠశాల గ్రామీణ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

పరిగి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డిలు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో 750 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ శివరాం, ఏపీవో చంద్రశేఖర్, భాజపా మండల అధ్యక్షుడు బంగారు చంద్ర, తెదేపా నాయకులు శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్, నరసింహమూర్తి ఎస్ఎంసీ ఛైర్మన్ శివలింగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యాక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచేత మొక్కలు నాటి నీళ్లు పోశారు.

చెక్‌పోస్టు వద్ద రోడ్డు విస్తరణ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం నుంచి బెంగుళూరుకు వెళ్లే జాతీయ రహదారిలో తూముకుంట చెక్‌పోస్టు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసుకున్న వివిధ దుకాణదారులు తమ వ్యాపారాలను రోడ్డుపైకి వచ్చి చేయడంతో వాహనాలకే కాదు నడిచి వెళ్లే పాదచారులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామీణ సీఐ ఆంజనేయులు చొరవతీసుకొని ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రెండు రోజుల నుంచి విస్తరణ పనులు యంత్రాల సాయంతో అధికారులు కొనసాగిస్తున్నారు.



తూముకుంట చెక్‌పోస్టు వద్ద చేస్తున్న పనులు

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

మా సార్ గోరింటాకు తెమ్మన్నారు!

న్యామద్దల (చెన్నేకొత్తపల్లి) : ఓ ఉపాధ్యాయుడు బడి పిల్లలను గోరింటాకు తీసుకురావాలని బయటికి పంపిన సంఘటనపై వీడియో ఒకటి వైరలైంది. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలలో మంగళవారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులను గణిత ఉపాధ్యాయుడు గోరింటాకు తీసుకురావాలంటూ బయటికి పంపడంతో వారు శిథిలమైన ఇంటి ప్రహరీ పైకెక్కి గోరింటాకు తీస్తుండగా ఇంటి యజమానులు బయటికి వచ్చి ప్రశ్నించారు. మా గణితోపాధ్యాయుడు గ్రామంలో ఎక్కడైనా గోరింటాకు చెట్టు ఉంటే తీసుకురమ్మని చెప్పడంతో వచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. వారు చెప్పే వివరాలను స్థానికులు చరవాణిలో వీడియో తీసి గ్రామస్థులకు పంపడంతో అది వైరలైంది. పలువురు ఉపాధ్యాయుడిని నిలదీశారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ నాయక్ దృష్టికి తీసుకుపోగా పిల్లలను తామే బయటికి పంపలేదని, గ్రామంలోకే పంపించామని సమాధానమిచ్చారు.

అలరించిన సంగీత విభావరి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని కదిరి ఆర్యవైశ్య వసతి మందిరంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. వీనుల విందైన పాత పాటలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు పాడి వినిపించారు. కార్యక్రమంలో కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.పార్థసారథి, నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, న్యాయవాది నాగేశ్వర సత్యనారాయణ, డాక్టర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. సంగీత విభావరిలో పాటలను ఆలకించేందుకు పెద్దసంఖ్యలో శ్రోతలు తరలివచ్చారు. మధురమైన పాటలను ఆలపించిన గాయకులను, ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు.

పట్టాల పందేరం

• రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారుల నిర్లక్ష్యం



ఆక్రమిత భూమిలో తాత్కాలిక నిర్మాణాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం హిందూపురం రోడ్డులోని సర్వేనంబరు 96లో ఉన్న ప్రభుత్వ భూమిలో పట్టాల పందేరం సాగుతోంది. కొందరు వ్యక్తులు బృందంగా ఏర్పడి ప్రభుత్వ భూమిని చదునుచేస్తూ ఒకటిన్నర సెంటు చొప్పున కొలతలు వేసి విక్రయిస్తున్నారు. ఈ భూమికి సమీపంలోని సర్వే నంబరు 1770లో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పట్టాలు మంజూరు చేశారు. వివాదాలు, ఇతర కారణాలతో భవన నిర్మాణ కార్మికులు ఇళ్లు నిర్మించుకోలేదు. ఏదేని స్థలం నుంచి భవన నిర్మాణ కార్మికులు ఒక్కొక్కరుగా ఇళ్లు కట్టుకుంటున్నారు.

ప్లాటు ఒకచోట.. ఇంటి నిర్మాణం మరోచోట

కార్మికులకు ఇళ్లు నిర్మించుకుంటున్న సమీపంలో జగనన్నకాలనీ ఏర్పాటు చేసి 500 పైగా ఇళ్లు మంజూరు చేశారు. దీన్ని అదనుగా చేసుకున్న కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిపై కన్నేశారు. హిటాచీల సాయంతో కొండను తవ్వేస్తూ మట్టిని అమ్ముకుంటున్నారు. మట్టిని తోడేశాక భూమిని చదునుచేస్తూ ప్లాట్ల లెక్కన విక్రయిస్తున్నారు. డబ్బులు ఇచ్చి ప్లాట్లు కొనుగోలు చేసినవారు తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. ఆర్డీఓ, గృహనిర్మాణశాఖ డీఈ కార్యాలయాలకు ఎదురుగానే గుట్టను తవ్వేసి ఇల్లు కట్టేస్తున్నా.. రెండుశాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. సర్వే నంబరు 1770, 1769, 96లలో అనుమతులు లేకుండానే ఇళ్లు నిర్మిస్తున్నారు. పట్టాలు పొందింది ఒకచోట ఇల్లుమరోచోట కడుతున్నారు. సంబంధిత అధికారులెవరూ వీటిగురించి పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో పునాదులు వేస్తున్నా సంబంధిత గ్రామరెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ స్థలంలో మట్టితరలింపు, నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. మట్టి తవ్వినవారిని, పునాదులు వేస్తున్నవారిని గుర్తించాలని ఇద్దరు వీఆర్వోలను ఆదేశించినట్లు చెప్పారు. ప్లాట్లుగా అమ్ముతున్న ప్రదేశాన్ని పరిశీలించి పునాదులు తొలగిస్తామని వివరించారు.

శాస్త్రీయ ఆలోచనతో సమాజాభివృద్ధి


కదిరి: జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: శాస్త్రీయ ఆలోచనతో సమాజాభివృద్ధి చెందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి: చెకుముకి పరీక్షలలో పోటీ పడటం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయతను పెంచేలా అన్ని యాజమాన్య పాఠశాలల్లో చెకుముకి విజ్ఞాన పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల స్థాయి పోటీలను కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు.

ధర్మవరం పట్టణం: నియోజక వర్గ స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షల విజేతలుగా పట్టణానికి చెందిన కాకతీయ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. మంగళవారం ఎన్జీవో హోమ్‌లో జరిగిన ఈ సైన్స్ టాలెంట్ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల దాతృత్వం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం పట్టణానికి చెందిన నాగార్జున పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.10 వేలు ప్రకటించారు. మంగళవారం ఈ నగదును పాఠశాల చిన్నారులు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు పుట్టపర్తిలో అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రుసుముల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో విద్యాశాఖాధికారి రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీలకు అడ్డూఅదుపు లేకుండాపోతోందని విమర్శించారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కదిరి, న్యూస్‌టుడే: హక్కులు సాధించుకునేందుకు యువత, విద్యావంతులు, ఉద్యోగుల భాగస్వామ్యంతో ఉద్యమిద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ పిలుపునిచ్చారు. కదిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతన కమిటీల ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో పేదవర్గాల హక్కుల సాధనకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం సాగించనున్నట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు, మణివర్ధన్, గంగాధర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తిలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నలుగురికి రూ.2,51,145 అందజేశారు. ఓడీసీ మండలం కుసుమవారిపల్లికి చెందిన భాగ్యశ్రీకి రూ.1.07 లక్షలు, వీర ఓబునలపల్లికి చెందిన భారతికి రూ.82.02 వేలు, పుట్టపర్తికి చెందిన వెంకట్రాముడుకు రూ.63 వేలు, సుబ్బరాయునిపల్లికి చెందిన పవన్‌కుమార్‌కు రూ.37 వేలు చొప్పున చెక్కులు అందజేశారు.

బదిలీపై వెళుతున్న ఆర్డీవోకు వీడ్కోలు


ఆర్డీవో వెంకటశివరామిరెడ్డిని సన్మానిస్తున్న భాజపా నాయకుడు హరీష్, తదితరులు

ధర్మవరం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని మంత్రి సత్యకుమార్‌యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ అన్నారు. ధర్మవరం నుంచి బదిలీపై వెళుతున్న ఆర్డీవో వెంకటశివరామిరెడ్డికి మంగళవారం ఆర్డీవో కార్యాలయ సమావేశ భవనంలో వీడ్కోలు సభ నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగులు, భాజపా, తెదేపా, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు ధర్మవరం ఆర్డీవోగా వచ్చిన తనను ఇక్కడి ప్రజలు ఎంతో ఆదరించారని, అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలిగానని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవోను రెవెన్యూ ఉద్యోగులు, నాయకులు ఘనంగా సన్మానించారు. తెదేపా పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, జనసేన నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిత్రావతి నదిలో శ్రమదానం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని యువజన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం సంస్కృతీ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చిత్రావతినదిలో వ్యర్థాలను తొలగించారు. సత్యసాయి నడియాడిన పవిత్రమైన చిత్రావతినది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు దుస్తులు ఇవ్వాలి

కదిరి పట్టణం: విజయవాడ వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పరిపాలన విభాగం ప్రకటించిన విధంగా రెండు జతల దుస్తులు, వాటి కూలి చెల్లించాలని సీఐటీయూ నాయకులు మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్‌ను కోరారు. సీఐటీయూ నాయకులు జగన్మోహన్, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకుడు బాలకృష్ణ మంగళవారం డీఈని కలిసి వరద సహాయకచర్యల్లో పాల్గొన్న కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులను వెంటనే ఇవ్వాలని కోరారు. డీఈని కలిసినవారిలో ముస్తాక్, తిరుపాలు, జనార్దన్, చిన్నికృష్ణ ఉన్నారు.


తలుపుల: కుర్లి రెడ్డివారిపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఇది ప్రజా ప్రభుత్వం.. హామీలన్నీ అమలు చేస్తాం

తమది ప్రజా ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసి తీరుతామని పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, దీపావళి నుంచి మహిళలకు ఉచిత సిలిండర్ల పంపిణీ, దసరాకు పేదలకు కందిపప్పు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం జనసేన నాయకులు కదిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో నమోనారాయణ మంత్రపఠనం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆలయాల్లో మంత్ర పఠనం చేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ అన్నారు. కలియుగదైవం ఆలయంలో అపచారానికి కారణమైన మాజీ ఛైర్మన్లు, ఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చలపతి, రవి, రమణ, అంజిబాబు, శ్రీనివాసులు, రామచంద్ర, పార్థసారథి పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.11 లక్షల విరాళం

అమడగూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా అమడగూరు మండల తెదేపా శ్రేణులు దాతృత్వాన్ని చాటుకున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమిరికుంట్లపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సాకేవారిపల్లికి చెందిన రాజారెడ్డి రూ.50,116 విరాళం అందజేశారు. అమడగూరు మండలం నుంచి ఇప్పటివరకూ రూ.11 లక్షల విరాళం వచ్చినట్లు తెదేపా నాయకులు తెలిపారు. అలాగే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కాళేనాయక్, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి ఎంపీడీవో ముణెప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఓబుళదేవరచెరువు: కొండకమర్లకు చెందిన తెదేపా కార్యకర్త రవీంద్ర తల్లి నరసమ్మ మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాజారెడ్డి, బడిశం రామాంజనేయులు, జాకీర్ అహ్మద్, గంగాద్రి, సురేష్, చిన్నరాయుడు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాత సచివాలయంలో చోరీ

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాత సచివాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు కార్యదర్శి సుమియా తెలిపారు. కార్యాలయంలో వైద్య సిబ్బందికి చెందిన బీపీ మిషన్, దాదాపు రూ.20 వేలు విలువచేసే కొన్ని పరికరాలు చోరీకి గురైనట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పోలీసులు నిఘా ఉంచాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న గ్రామీణ సీఐ శ్యామరావు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుణ్ని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం గ్రామీణ సీఐ శ్యామరావు మాట్లాడుతూ బహిర్భూమికి వెళ్లిన మహిళపై నిందితుడు దాడి చేసి అత్యాచారానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు నిందితుడిని నార్శింపల్లి సమీపంలో అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. బాలికలు, మహిళల పట్ల ఎవరు అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు వన్నప్ప, సూర్యానారాయణరాజు, సిబ్బంది విష్ణు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం


భార్గవ్

తనకల్లు : మండలంలోని చీకటిమానిపల్లి సమీపంలో 42 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగుట్లపల్లికి చెందిన భార్గవ్ (30) అక్కడికక్కడే మృతిచెందాడు. బాలసముద్రం పంచాయతీ నల్లగుట్లపల్లికి చెందిన శంకర్‌కు ఇద్దరు కుమారులు. రెండో కొడుకు భార్గవ్ బొలెరో వాహనం నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. సోమవారం రాత్రి మదనపల్లికి టమాటాలు తీసుకెళ్లి తిరిగి వస్తుండగా మదనపల్లి వైపు వెళ్తున్న కంటైనర్ లారీ చీకటిమానిపల్లి సమీపంలోని నడిమి వంక వద్ద ఢీకొంది. తీవ్రంగా గాయపడిన భార్గవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి మృత్యువాత

ముదిగుబ్బ: శీలంవాండ్లపల్లి దగ్గర మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తప్పెటవారిపల్లికి చెందిన అన్వేష్(23) అనే యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన సుందరయ్య కుమారుడు అన్వేష్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. రాత్రి సమయంలో స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో మలకవేములక్రాస్‌కు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పట్నం ఎస్సై నరసింహులు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తినగారిపల్లికి చెందిన సూరినేని పెద్దక్క సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించింది. వైకాపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆమె అంత్యక్రియల నిర్వహణకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం బత్తల హరిప్రసాద్ తండ్రి బత్తల వెంకటరమణ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పతక విజేతకు అభినందనలు

పుట్టపర్తి పట్టణం: చండీగఢ్ రాష్ట్రం బిలాయ్ పట్టణంలో జరిగిన ఆలిండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో కాంస్య పతకం సాధించిన హిందూపురం గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మంజమ్మ మంగళవారం ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. పతక విజేత మంజమ్మను జిల్లా ఎస్పీ అభినందించారు.

రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయండి

ధర్మవరం: చౌకధాన్య డిపోల డీలర్లు కార్డుదారులకు రేషన్ సరకులు సక్రమంగా అందజేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం శివానగర్, కొత్తపేట, మారుతినగర్, సాయినగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో 5 చౌకధాన్య డిపోలను మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కొత్తపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. జనసేన నాయకులు రాజారెడ్డి, పేరూరు శ్రీనివాసులు, చంద్రశేఖర్, బి.శ్రీనివాసులు, ప్యాదిండి వెంకటేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

గొర్రెల అపహరణకు యత్నం

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గుంతపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గొర్రెల అపహరణకు ఓ దుండగుడు ప్రయత్నించినట్లు అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు రమేష్, ఆదెప్ప పేర్కొన్నారు. గుంతపల్లికి సమీపంలో బాధిత గొర్రెల కాపర్లు గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం రాత్రి గొర్రెల మందకు ఏర్పాటు చేసిన కంచెను అదే గ్రామానికి చెందిన దుండగుడు ఓబిలేషు తొలగించి గొర్రెలను అపహరించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో కుక్కలు మొరగడంతో ఆ అలికిడి గొర్రెల కాపర్లు లేచి చూడగా ఆ దుండగుడు పారిపోయాడు. గొర్రెల కాపర్లతో పాటు సమీపంలో రైతులు వెనకాలే వెంబడించిన ఆ దొంగ దొరకకుండా పారిపోయాడు. బాధిత గొర్రెల కాపర్లు కనగానపల్లి పోలీసుస్టేషనులో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మృతుడు బీటెక్ విద్యార్థి


కళ్యాణ్‌కుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: రాప్తాడు రైల్వే గేటు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కిందపడి మృతి చెందిన యువకుడు రాయదుర్గం మండలం కెంచానపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి కళ్యాణ్‌కుమార్ (20)గా రైల్వే పోలీసులు గుర్తించారు. తన కుమారుడు కనిపించడం లేదని కళ్యాణ్‌కుమార్ తండ్రి పాండు అనంతపురం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. రాప్తాడు రైల్వేగేటు సమీపంలో ఒక యువకుడు రైలు కిందపడి మృతి చెందాడని సీఐ రాజేంద్రనాథ్ తెలిపారు. ధర్మవరం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ షణ్ముఖరెడ్డికి సమాచారం అందించారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న పాండు చెందింది తన కుమారుడు కళ్యాణ్‌కుమార్‌గా గుర్తించారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్నాడని, సబ్జెక్టులు తప్పడంతో కొంతకాలంగా మానసికంగా ఆందోళన చెందుతుండేవాడని తెలిపారు. ఈ దశలో జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని ధర్మవరం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెదేపా నాయకుడి మృతికి నివాళి

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కోనాపురానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు పాములపాటి సూర్యానారాయణ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహానికి ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు బాలాజీ, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశు, నాయకులు రాజాకృష్ణ, పరిటాల రవీంద్ర, దామోదర్, శివ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ధర్మవరం : పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన ఓ వివాహిత మంగళవారం ఇంట్లో అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. భర్తతో కుటుంబ విషయంలో గొడవపడి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిందని 2వ పట్టణ పోలీసులు తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి

ధర్మవరం: ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్ద గత నెల 22న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కనగానపల్లి మండలం చంద్రాచర్లకు చెందిన మందల నారాయణప్ప (70) మృతి చెందారు. అనంతపురం, కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చిన నారాయణప్ప మంగళవారం మృతి చెందారు. ధర్మవరం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువుకు చెందిన కొత్తకోట శివయ్య (58) అనేవ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శివయ్య మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొమ్మలు నరికిన వ్యక్తిపై కేసు

తలుపుల, న్యూస్‌టుడే: పెద్దన్నవారిపల్లికి చెందిన గంగయ్య మామిడి తోటలో చెట్టు కొమ్మలు నరికేసిన గంగాద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్‌కుమార్ చెప్పారు. మామిడి తోటలో దాదాపు 15 చెట్లకు కొమ్మలు నరికేయడంతో గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఫిర్యాదు ఆధారంగా అదే గ్రామానికి చెందిన గంగాద్రిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మొక్కజొన్న ధర పతనం.. అన్నదాతకు నష్టం

• ఆరుగాలం శ్రమించినా.. పంట అమ్ముకోలేని దైన్యం


ఇంట్లో నిల్వ చేసుకున్న మొక్కజొన్న చూపుతున్న రైతు రామచంద్ర

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి మొక్కజొన్న సాగుచేసిన రైతుకు ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులే తోటవద్దకు వచ్చి కొనుగోలు చేసేవారు. క్వింటా రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముడుపోయే మొక్కజొన్న ధరలు ఈఏడు పూర్తిగా తగ్గిపోయాయి. దళారులు క్వింటా కేవలం రూ.3 వేల నుంచి రూ.3,500తో కొనుగోలు చేస్తుండటంతో తక్కువ ధరకు అమ్ముకోలేక రైతులు ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్నారు. ముదిగుబ్బ మండలంలో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. అత్యధికంగా కొండగట్టుపల్లి, మల్లేపల్లి, మలకవేముల, ముక్తాపురం పంచాయతీల్లో రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. 90 రోజుల పంట కావడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని అధిక మంది రైతులు మొక్కజొన్న సాగుచేశారు. పంట దిగుబడి వచ్చాక ధరలు పడిపోవడంతో ఏం చేయాలో రైతన్నలకు దిక్కుతోడం లేదు.

ఇంట్లోనే నిల్వ చేసుకున్నా

రూ.35 వేలు పెట్టుబడిపెట్టి ఎకరాలో మొక్కజొన్న సాగుచేస్తే 13 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏటా దళారులకు విక్రయిస్తుండగా ఈసారి కొనేవారు కరవయ్యారు. ధరలు పడిపోవడంతో దళారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. అతితక్కువ ధరలకు అమ్ముకోలేక ఇంట్లోనే నిల్వచేసుకున్నాను. రైతులకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తే మేలు.

- రామచంద్ర, నల్లచెర్లోపల్లి